# అంతిమ విజయం అ.సత్యానిదేనా

- అవసరాల రామకృష్ణారావు

'అద్దంకి సత్యనారాయణమూర్తికి సత్కార సభ' అనే ఆహ్వాన పత్రం అందుకున్నాను. ఇటు రాష్ట్ర స్థాయిలోనూ, అటు కేంద్ర స్థాయిలోనూ గుర్తింపు పొంది భారీఎత్తున సన్మానాలు ఇదివరకే అందుకున్నాడు. అతని సాహిత్యం మీద ఇదివరకే కనీసం నలుగురి చేత పరిశోధన జరిగిందనిపించి అవి గ్రంథస్థం అయ్యే ఏర్పాటు కూడా చేసుకున్నాడు. అతని ఆధ్వర్యంలో ఎన్నో తెలుగు పుస్తకాలు అందంగా ముద్రితమై ప్రశంసలందుకున్నాడు. షష్టిపూర్తికి విశిష్టమైన సభ కూడా జరిగి స్వర్ణకంకణం తొడిగించుకున్నాడు. ఇప్పుడు ఏ విశేషం లేకుండా ఈ సభ దేనికి? గట్టిగా కాదంటే బలవంతాన స్టేజి మీదకి ఎంత అభిమానులైనా ఎత్తుకుని తీసికెళ్లి కూచోపెట్టరు కదా! ఇటు హైదరాబాదు నుంచీ అటు ఢిల్లీ నుంచీ ఈ విజయవాడ సభకి వక్తలు వస్తున్నారంటే ఏదో ప్రత్యేకత ఉండే ఉండాలి కదా! ఈ కొత్త ఏర్పాటు చూసి ఇదివరకైతే మొహం తిరిగి పడిపోయి ఉందును. ఇప్పుడిప్పుడే నాకూ జ్ఞానోదయ మౌతోంది మరి!

కలసి చదువుకున్నాం. అన్ని ప్రసిద్ధ పత్రికల్లోనూ పక్క పక్క పేజీల్లో విధిగా మా విప్లవ గీతాలు అచ్చయేవి. గ్రాడ్యుయేట్ గాని మా వాడిది మంచి జ్ఞాపకశక్తీ, గొప్ప అవగాహనా శక్తీ. పై తిరుగుళ్లకి సరిపోయే పై సంపాదన లేని సామాన్య ఉద్యోగిగానే సత్యం రిటైర్ అవవలసి వచ్చింది. అయితే పింఛను పుచ్చుకున్నాకే పింఛం విప్పి నర్తించగల అరుదైన అవకాశం అనుకోకుండానే అతనికొచ్చింది.

మరేం లేదు, కేతవరపు విష్ణుకుమారి అనే ఒక కవయిత్రి, మా కంటె ఒకటి రెండేళ్ల సీనియర్ రైటరు, ఆ రోజుల్లోనే విప్లవ గేయ రచయిత్రిగా గొప్ప పేరు సంపాదించింది. ఆమె రాజకీయ సామాజిక స్పృహ మేధావులని చెప్పుకునే మాకే అందకుండా పోతే కన్న తండ్రికీ, కట్టుకున్న మొగుడికీ ఎలా ఉండేదో మరి! విధవరాలై ఇంటికి చేరిన ఆవిడ మేనత్త విష్ణుకుమారిని దత్తతకి తీసుకుని ఆమె పేర లక్ష రూపాయల నగదే బ్యాంకులో వేసిందని చెప్పుకునేవారు. బలవంతం మీద పెళ్లయితే ఎలా చేసుకుందో గాని, ఆ అమ్మాయి కేవలం రాతలే కాదు, విప్లవ దళాలతో అడవులమ్మట తిరిగేదట! అంతేకాదు, ఏదో ఎన్‌కౌంటర్లో ఎదురుకాల్పుల్లో మరణించిందట. డబ్బుంటే ఉంది గాని, ఇంకా పెళ్లి కావలసిన పిల్లలున్న ఆవిడ తండ్రికి కూతురు పోవడమే ఓ విధంగా ఊరట. ఎర్ర రంగు చూస్తే ఏ నూట మూడో జ్వరం తెచ్చుకునే మొగుడికీ అంతేనట. డబ్బిచ్చిన మేనత్త ముందే పోయింది. ఇచ్చిన డబ్బు పుచ్చుకున్నావిడకి ఆ అవసరమే రాలేదు. ఇక దాన్ని ముట్టుకుంటే ఎవరికేం బెడిసి కొడుతుందో అని తండ్రీ మొగుడూ బెంగెట్టుకు చస్తున్నారు. అయినా సాటి విప్లవ రచయితలు ఏర్పాటు చేసిన ఓ స్మారక సాహితీ సభకి ఆ మామా అల్లుళ్లు రాక తప్పలేదు. గుమ్మానికి కట్టిన బ్యానరు చూసి ఆ సభా ప్రాంగణంలోకి అడుగు పెట్టిన మా సత్యానికి అదో అపూర్వ అవకాశం అని అప్పుడు తెలిసుండకపోవచ్చు. ఆమె సాహితీ సేవ గురించి గంటలకొద్దీ మాట్లాడిన పార్టీ మనుషులకి కనీసం ఆమె విప్లవ గేయాల పేర్లయినా రాకపోవడం మావాడికి ఎంతో లాభించి వుండాలి. ఆ సభకు నేనూ ఎటెండయాను. గనక మా సత్యంగాడు ఏం మాటాడాడో ముక్క ముక్కా నాకు గుర్తుంది.

'శ్రీమతి విష్ణుకుమారి పోరాట పటిమ ఆధునిక ఉద్యమాలకన్నిటికీ ఊపిరి. రచనలతో తృప్తిపడక

రంగంలోకి దిగిపోయి విప్లవానికి ఊపిరి పోయడానికి తన ఊపిరినే కానుకగా యిచ్చిన సాహసి. ఎన్నేళ్లు బతికామని కాదు, పీడిత జనానికి ఏం చేశామని. పెద్దలిచ్చిన ఆస్తిలో పైసా ముట్టుకోలేదు. తమాషా ఏమిటంటే, చనిపోయిన భార్య గొప్పతనాన్ని అంతకంటె పెద్ద మనసుతో ఇక్కడ కూచున్న ఆమె భర్త రుజువు చేస్తున్నాడు. ఒకటా రెండా లక్ష రూపాయలు ఎవరికైనా చేదా! అయినా ఆ ఆస్తి మీద పూర్తి హక్కులు వదులుకున్నాడంటే ఎంతటి త్యాగం!'

ఇంతకీ ఆ రొక్కం ఎక్కడుందీ, ఏ విధంగా ఖర్చు పెట్టాలీ అనేది ఆ సభికుల గుసగుసలకి తావిచ్చింది. దానికీ మావాడే జవాబిచ్చాడు.

'నా సూచన ఎలా వుందో పెద్దలందరూ ఆలోచించండి. విష్ణుకుమారి రాసిన విప్లవ గీతాలు సంపుటాలుగా ముద్రించి ముందు తరాలకు సాంస్కృతిక సంపదగా అందించడం మన ప్రథమ కర్తవ్యం. ఆమె పేరున ఓ లిటరరీ ట్రస్టును ఏర్పాటు చెయ్యాలి. ట్రస్టు అంటే ఏం చెయ్యాలో పైనుండి ఉచిత సలహాలు ఇస్తాను గాని ఎటువంటి బాధ్యతా వహించలేనని ముందే మనవి చేస్తున్నాను. ప్రెసిడెంటూ, సెక్రటరీ, ట్రెజరరూ యిలా వివిధ పోస్టుల్ని స్వలాభాపేక్ష లేని మెంబర్లు ఎంచుకుంటారు. ఆవిడ పుస్తకాలు అచ్చు వేయించడంతోపాటు ప్రతీ ఏటా మంచి విప్లవ గేయ సంకలనాలకి ఒకటి, రెండు, మూడు బహుమతులిచ్చి సభ నిర్వహిస్తే విష్ణుకుమారి ఆత్మ శాంతిస్తుంది. మళ్లీ చెబుతున్నాను- సంసార భారంతో ఇప్పటికే క్రుంగిపోయి వున్న రిటైరైన ఈ వృద్ధుడి భుజాల మీద మాత్రం దీనికి సంబంధించిన ఏ పనిలోనూ దూర్చకండి' అంటూ పై కండువాతో కళ్లద్దుకుంటూ కూలబడ్డాడు.

విష్ణుకుమారి కుటుంబానికి తెచ్చిన 'మచ్చ' నుండి రక్షించబడడానికి తన చేతి మరో లక్షయినా యివ్వడానికి సిద్ధంగా ఉన్నాడు ఆమె తండ్రి. ఓ పెద్ద యిల్లూ, అయిదు లక్షల విలువ చేసే పొలమూ కట్నంగా యిచ్చి తనకి మళ్లీ కాళ్లు కడగడానికి కబురు మీద కబురు అందుతోంది విష్ణుకుమారి మొగుడికి. సత్యనారాయణమూర్తి ధర్మమా అని ప్రజల మనసు అటు మళ్లిస్తే ఆ పీడ విరగడవుతుంది. ఇక సభని హోరెత్తించిన ఉద్యమకారుల సాహితీ స్థాయి ఎలా వుందంటే 'శబ్దం' అనే పదాన్ని 'శబ్ధం'గా పలికితే మరింత ఘనంగా మార్మోగుతుందని వల్లమాలిన ఉద్రేకంతో ఊగిసలాడుతున్నారు. అందరూ కలిసి 'మీరీ బాధ్యత వహించక తప్పదు' అని సత్యం కాళ్ల మీద పడ్డారు. గంటల తరబడి బతిమాలించుకుని 'ఎంతసేపైనా చేస్తాను. ఎక్కడా పైకి మాత్రం కనపడను' అంటూ అప్పటికప్పుడు పూర్తి పెత్తనం చేజిక్కించుకున్నాడు.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. ఎక్కడా అచ్చు తప్పు అనేది లేకుండా అందమైన పుస్తకాలు అనుకున్న టైముకి తీసుకురావడంలో సత్యానికి సాటిరాగల చెయ్యి మా కృష్ణా జిల్లా మొత్తంమీద లేదు. ఇక సభా నిర్వహణలో అతనింత నిష్ణాతుడని నాకే తెలీదు.

అతను ఏం చేసినా కాదనలేని భజన బృందాన్ని ఎప్పుడో ఏర్పాటు చేసి ఉంచుకున్నాడు కనుక ఎప్పుడు ఏ ప్రైజు ఎవరికొచ్చినా అతని శాసనమే అని అందరికీ తెలుసు. అయితే కార్యాలయానికి చేరిన పుస్తకాన్ని కనీసం పది మంది న్యాయనిర్ణేతలు చదువుతారనీ, వారి నిర్ణయం రహస్యంగా అందిస్తే మరో ముగ్గురు చూస్తారనీ, వారిలో ఇద్దరు ఓటు వేసిన వారికే బహుమతి అనీ సంతకాలు చేసిన రికార్డు చెబుతూంటే ఎవరేం అనగలరు! క్రమంగా ఆ ట్రస్టు ఇతరుల పుస్తకాలు బాగుంటే వెయ్యొచ్చని సభ్యులు తీర్మానిస్తే అతనేం చెయ్యగలడు! క్రమక్రమంగా ఆ 'చక్కని రాజమార్గమున' అతని పుస్తకాలు కూడా అచ్చయి శత్రువుల గుండెల్లో చిచ్చు రేపుతుంటే సత్యానిదా పూచీ? చేతికి తడి అంటుకోకుండా స్వామి కార్యం కంటే స్వకార్యమే నిర్వహించుకోగల రాజకీయ దురంధరులు ఎందరు లేరు మన వ్యవస్థలో!

చేతో ఆ ఆహ్వాన పత్రిక పట్టుకున్న నాకు నా స్వానుభవం గుర్తుకురాకుండా ఎలా ఉంటుంది. ఎంచేతంటే ఆ ఏటి సాహితీ సేవా ట్రస్టు విప్లవ గీతాల ప్రైజు కోసం నా 'రక్తదాహం' అనే గేయ

సంపుటిని పంపించాను. ఆ ప్రైజు కోసం, ఎంపిక నిమిత్తం వాడే కొన్ని గేయ సంపుటాలు, ఇతరులు పంపినవి చూడమని నాకిచ్చాడు. నా దృష్టిలో నాకు పాస్ మార్కులు పడితే తక్కిన ఏ ఒక్క ఎంట్రీ నూటికి పదిహేను మార్కులు దాటదు. ఇక ఏ ఏడాది పదివేల ప్రైజు నాది కాక మరెవరిదౌతుంది అని ఉవ్విళ్లూరినన్నాళ్లు పట్టలేదు. 'చిన్న పొరపాటు జరిగిందిరా కిష్టూ, న్యాయ నిర్ణేతల్లో ఒకడివిగా నువ్వూ పనిచేశావని రికార్డయి పోయింది కదా, రూల్స్ ప్రకారం నీ ఎంట్రీ ఎలా తీసుకుంటాను, సారీ!' అనేశాడు. రన్ గ్రామర్ని పరిగెత్తించే గ్లామరు ప్రదర్శించిన ఓ విప్లవశ్రీకి ఆ ప్రైజు అందచేశాడట, తర్వాత చెరో అయిదు వేలూ పంచుకున్నారట! చేసేదేముంది, సాహిత్యాన్ని వ్యాపారంగా మార్చలేని నాలాంటి వాళ్లకి నెత్తికి చేరువే! త్వరలో మా వాడికి జ్ఞానపీఠ్ అవార్డొచ్చినా నాకేం ఆశ్చర్యం ఉండదు!

# 'పదుగురాడు మాట...'

*- డా॥ అయాచితం నటేశ్వరశర్మ.*

'పదుగురాడు మాట పాడి' కావడం
పదునుదేరుతోంది అంతటా
దీపం చుట్టూ ఆవరించే చీకటి
దీపాన్నే మింగేసినట్టుగా
పబ్బం గడుపుకునే వాళ్ల సంఖ్య
ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నంత కాలం
పదుగురాడు మాట పాడి కానేకాదు
ఎదిగిపోతున్నామనుకొన్నా ప్రగతి రానేరాదు
పచ్చి నిజాల కిరణాలు మూలమూలల్లో దాగుంటాయి
మిణుకు మిణుకుమనే చిన్న చుక్కల్లా
చిన్న చుక్కలని చిన్నచూపు చూడకు
మిన్నులో వెలిగే మిన్నలైన చుక్కలన్నీ
ఒకనాటి చిరుచుక్కలేనని మరచిపోకు!
ఉజ్జ్వలంగా మండుతున్నంత మాత్రాన
మంటల్ని ప్రేమతో ముద్దాడలేం కదా!
మెదడును కదిలించడానికి ఒక్క మెరుపు చాలు!
కుదిపివేసే ఒత్తిడి కంటే
మది కదిలించే మధురానుభూతి ఒక్కటి మేలు!
దుర్మార్గం మూర్తీభవించిన సమిష్టి కంటె
సన్మార్గాన్ని ఆవిష్కరించే వ్యష్టి మేలు!
అందుకే పదుగురాడు మాట పాడి కానేకాదు
అందరూ అగ్ని సదృశులు కాకుంటే!
అందరి ఆర్తీ తన ఆర్తిగా లేకుంటే!!